# సజీవ శిల్పం! ★

రచన: శ్రీ జి. యస్. కె. సాయిబాబా.

(గత సంచిక తరువాయి)

చాలా మంది ఒకరినొకరు ఆకర్షించుకుని దానికి ప్రేమ పేరుపెట్టి పెళ్ళి అనే స్వార్థానికి ముడిపెట్టి భార్యాభర్తలవుతారు. అది వారి పాలిట శాపమై బలిగొంటుంది. భార్యా భర్తల మధ్య కీచులాటలు విడాకులు, ఎవరి దారి వారిది కష్టాల పాలవుతున్నారు.

ప్రేమ స్వేచ్ఛా జీవి విచ్చల విడిగా పోతుంది. దాన్ని పట్టి బంధించటం కష్టం చరిత్ర నుండీ వస్తుంది. రోమియో, జూలియెట్, సలీం_అనార్కలి, లైలా_మజ్నూ ఈ ప్రేమికులు కోరిందిస్వార్థమే. రోమియో, జూలియెట్ లు ప్రాణం తీసుకున్నారు, సలీం_అనార్కలి సమాధిలువై పోయారు, లైలా_మజ్నూలు ఎడారి పాలై పోయారు. మేమూ అదేమాదిరి కోరుకోలేదు నిస్వార్థ ప్రేమ అమరమవుతుంది.

సజీవశిల్పం అన్నావు. చాలా బాగుంది. శిల్పం అంటే జీవంలేనిది, కానీ నీవు జీవంవున్నదానివి, రక్త మాంసాలుకలిగి, వువ్వాకారాలు తగిలి రూపం దిద్దుకుంటున్న శరీరం. మనోహర్ నిన్ను స్పర్శించినప్పుడు ఏ భావం కలగలేదు, కలగదంటే అలకించిన వాళ్ళు నవ్వుతారు. చేసేది నీచమైన పని దానికి అందమైన అబద్ధాలు.

'ఛీ ఛీ మీరు మనుషులుకారు రాక్షసులు పచ్చకామెర్లరోగికి లోకమంతా పచ్చగానే వుంటుంది. మనోహర్ నన్ను కావాలనుకుంటే నేను మీ దాన్నే కాబోయేదాన్ని కాను. అందంలేదా, చదువులేదా, గుణం లేదా ఐశ్వర్యం తక్కువా?

"ఏదీ తక్కువకాదు"! ఎటొచ్చీ మీ అబ్బా అమ్మా, కట్నం యిచ్చుకోలేరు. అతని అంతస్థుకు తగలేరు, అందుకే నాలాంటి మధ్యతరగతిబిడ్డని కట్టుకున్నావ్ నా వెనుక నీ భాగోతం సాగిస్తున్నావ్. ప్రేమ కాదు, పెళ్ళికాదు!"

ఎంతో మంచివారు, వున్నతులు, విశాల హృదయులు అనుకున్నాను. యింత తక్కువ బుద్ధికలవారనుకోలేదు, యిరువురి స్నేహితులమధ్య రంపతనం కట్టే మీ విశాల హృదయానికి జోహారు! అసహ్యం వేస్తుంది మిమ్మల్ని చూస్తుంటే! వెళ్ళండవతలకి! గర్జించింది ఆడపులిలా.

మోహిని అవతారం ప్రకాష్ కి దడ పుట్టించింది, మారు మాటాడక క్రిందికి దిగివచ్చేసాడు.

మోహిని విలపిస్తూ మంచంపై వాలింది మనసు పరిపరి విధాల పోయింది. ఈ రోజు ఈయన కేమైంది? నిప్పులాంటి తనపై ఈ అభాండం వేయటం న్యాయమా? తమ వివాహం జరిగి పదిసంవత్సరాలైంది. తమ అనురాగ చిహ్నానికి యిద్దరు ముత్యాల్లాంటి బిడ్డలు. ఒడిదుడుకుల్లేకుండా సాగుతున్న సంసార జీవితంలో ఏమిటీ అనుకోని తుఫాన్? నేను చేసిన పాపం ఏమిటి? చిన్ననాటి స్నేహితుడ్ని నిష్కల్మహంగా ప్రేమించటమేనా? యిరువురు పురుషుల మధ్య స్త్రీల మధ్య చెలిమి వుండొచ్చు. ఒక స్త్రీ, ఒక పురుషుని మధ్య చెలిమి వుండకూడదా? వుంటే...దానికీరకంగా రంగుపులిమి మిలిడదియ్యటమేనా ఈలోకం పని? సోషల్ గా మూవ్ అవటం, అతి చనువుగా మసలటం కూడదా? భగవాన్! ప్రపంచం ఎటు పయనిస్తుంది?......అలాగే నిదుర పోయింది మోహిని.

♦ ♦ ♦

మోహినీ!... లే!... లే!... అంటూ లేపాడు ప్రకాష్. కళ్ళు నులుపుకుంటూ లేచింది. ప్రకాష్ వదనం ప్రశాంతంగా వుంది. అసలు ఏమీ జరగనట్లే ప్రవర్తిస్తున్నాడు. ఏమిటీ మాయ? మంచంపై నుండి మెల్లగా లేచింది. అప్పటికే పిల్లలు భోజనాలుచేసి పడుకున్నారు. డైనింగ్ టేబిలుపై వంటకాలన్నీ డిష్ల్లో వున్నాయి. ఒక కుర్చీలో కూర్చొని చిరునవ్వు చిందిస్తున్నాడు మనోహర్! తృప్తిపడింది.

హల్లో! బ్యూటీ ఏమిటీ సమయంకాని సమయం నిద్ర పనులన్నీ తెముల్చుకుని కానీ నిద్రించని తమరు ఏమిటీ అకాల నిద్ర పలుకరించాడు.

భయంగా భర్త వైపుచూసింది. భర్తకూడా అదే నవ్వుతో నిల్చున్నాడు. యిదంతా ఏమిటో, వెళ్ళి

పోయిన మనోహర్ ఎలావచ్చాడో! ఏమిటో అర్థంకా లేదు. మళ్ళా ఏం జరుగుతుందో నని విపరీతంగా భయ పడ సాగింది.

కానీ భోంచేస్తూ హాస్యోక్తులతో చలాకీగా, తీయగా మాట్లాడుకో సాగారు. మోహిని మాత్రం మౌన ముద్ర దాల్చింది.

మధ్యలో "అరె! మోహినీ...నువ్వేనా ఏమిటిలా మన్నుతిన్న పాములా వున్నావు. ఆ గలగల నవ్వేది? కిలకిల మాటలేవి, అబుజ్జగింపులేవి, కొసరికొసరి తల్లిలా తినిపించే మోహిని నేనా? ఏయ్!......ఏమయిందీ రోజు? అలావున్నావు? పెరుగు పోసుకుంటూ మోహిని వైపు చూస్తూ అడిగాడు మనోహర్.

"సారీ మనో...నా మనసేం బాగులేదు. కంచంలో చెయికడిగేసుకుంటూ అంది."

"అరె! మనసు బాగులేకపోతే కడుపేం పాపం చేసింది. దాన్నలా క్షోభపెడ్తున్నావ్!"

మౌనం వహించింది.

'అడవి రాముడి'కి టిక్కట్లు తెచ్చాను. పోదామా? నూటఎనభైవ రోజు ఆడుతున్నా ఎక్కడా ఖాళీలేదు, ఆంధ్రాపోలే అనిపిస్తుంది. నిర్మాత అదృష్టవంతుడు. మోహినీ తయారుకా! ప్రకాష్ నువ్వూ - ప్రకాష్ అందించిన మిటాయిపాన్ బుగ్గన పెడ్తూ అన్నాడు.

మరుక్షణం అబ్బా! ద్రోహీ ప్రకాష్ ఏంచేశావ్? అంటూ నేలకొరిగి ప్రాణం విడిచాడు.

మోహిని నిర్ఘాంతపోయింది. చేష్టలుడిగి నిల్చుండి పోయింది.

"ద్రోహి! ఎవడ్రా మిత్రద్రోహి! నా భార్యతో సరసాలా? వదిలింది పీడ! గుడ్ బై మనోహర్! కాలితో మనోహర్ శవాన్ని వెల్లికిలా త్రిప్పాడు.

మోహినిలో చలనం కలిగింది. మనోహర్ పరిస్థితికి దాదాపు పిచ్చిదయిందనే చెప్పాలి. ఆడపులిగా మారింది. చెంగున చెంగున గెంతి ప్రకాష్ షర్ట్ పట్టుకుని గుంజుతూ చెప్పండి! ఏం చేసారు? అంటూ పిచ్చి దానిలా రోదించ సాగింది. ఏంలేదు. విరోధిపీడ తొల గించాను. మిఠాయిపాన్‌లో పొటాసియంసైనేడ్ కలి పాను. బాధలేకుండా నిముషంలో ప్రాణం పోయింది. అంతే! అంటూ వికటాట్ట హాసం చేసాడు ప్రకాష్.

మీరు మనుషులుకాదు. నరరూపరాక్షసులు, దయా దాక్షిణ్యం లోపించిన కఠినపాషాణులు. మీ అనుమానా లకి, అపోహలకి నిండుప్రాణాన్ని బలిగొన్న కిరాతకులు వీళ్లేదు! మీతో వుంటే మీ అనుమాన పిశాచానికి బలితీసు కుంటారు. మీతో కాపురం నావల్ల కాదు...విపరీతంగా వణికిపోసాగింది.

'మోహినీ! గట్టిగా అరవకు!... అంటూ దగ్గరకు రాసాగాడు ప్రకాష్.





మీకు తెలుసా? మీరు ధరించియున్నది.

IS No. 4964

సి. టెక్స్

బనియన్లని?

లేనిచో, నేడే "సి. టెక్స్" బనియన్లను

కొని ధరించండి.

అవి :_ చక్కని అల్లిక _ సరైన కొలత,

దీర్ఘకాల మన్నిక, ధరించితె హాయి నిచ్చును.

: తయారించువారు :

Grams : CEETEX Phone : 21290

CHOWDAMBIKAI KNITTING CO.,

KAMARAJ ROAD : : TIRUPUR - 638604

వద్దు! వద్దు! అగండక్కడే! నన్ను తాకొద్దు. అంటూ వెనక్కి వెనక్కి నడుస్తూ పిట్టగోడ వద్దకు వెళ్ళింది.

"ఆగు మోహినీ ఆగు! వెనక ప్రమాదం! హెచ్చరిస్తూ ముందుకు రాబోయాడు గాభరాగా.

అదే గొప్పపొరపాటయింది, ప్రకాష్ నుండి తప్పించుకోవటానికి మరో రెండడుగులు వెనక్కి వేసిన మోహిని 'కెవ్వున' భయంకరంగా అరుస్తూ పిట్టగోడపై నుండి క్రిందపడి ప్రాణాలు విడిచింది.

♦ ♦ ♦

దిగ్గునలేచింది తెల్లగా తెల్లారిపోయింది. పీడకల అనుకొంది. వచ్చిన కల తలుచుకుంటే భీతి కలిగింది. భగవాన్ ఏమిటీ పరీక్ష? ఎందుకీ ధర్మసంకటం? నేను చేసిన పాపం ఏమిటి? నన్నెందుకిలా వేధిస్తున్నావ్. మనసులోనే మౌనంగా రోదిస్తూ మనోహర్‌కే కష్టం కలుగకుండా కాపాడు తండ్రీ. జీవితంలో మరేదీ కోరను? మౌనంగా పూజామందిరంలో ప్రార్థించుకుంది. కాఫీ, టిఫెన్ పూర్తిచేసుకుని సోఫాలో కూర్చుంది. అప్పటికే ప్రకాష్ ఎక్కడికో వెళ్ళాడు. పిల్లల్ని తయారుచేసి బడికి పంపింది పనిపిల్ల.

అమ్మగారికి వంట్లో బాగులేక పోతేతప్ప ఆలస్యంగా లేవదని దానికి తెలుసు, దానిపనులు నిర్విఘ్నంగా చక్క పెట్టుకు పోతుంది.

"పోస్ట్" అన్న కేకతో ఈలోకంలోకి వచ్చి గుమ్మంవైపు చూసేసరికి నౌకరు రంగన్న పొడవైన కవరందించాడు పై అడ్రసు చూసింది. చివరి దస్తూరీ కుతూహలం ఆపుకోలేక కవరుచింపి లోపలి కాయితాలు బైటకు తీసి చదువ సాగింది.

ప్రియమైన ప్రకాష్-

నిన్నటి రోజెందుకో చాలా సీరియస్‌గా వున్నావు. మన పరిచయంలో ఇన్ని సంవత్సరాల్లో నిన్నాపరిస్థితిలో చూసిన నాకు దేనికలావున్నావో బోధపడలేదు. మీ యింటి నుండి బైటకువచ్చిన నేను నిజమేమిటో దేని కాపరిస్థితిలో వున్నదీ తెల్సుకుని చాలాబాధ పడ్డాను. నిజం చెప్తున్నాను. నన్నుపుట్టించిన ఆభగవంతునిపై ఒట్టేసి చెప్తున్నాను. ఆమె ఒక శిల్పం. నేనొక ఆరాధకుడ్ని. యిదే మా యిరువురి అనుబంధం. ఈలోకం గుడ్డిది ప్రకాష్. దీన్ని నమ్మకు నమ్మావో నాశనం చేస్తుంది. నమ్మకున్నావో ఆకాశానికెత్తేస్తుంది. ఒక స్త్రీ, పురుషుడు కలసి వెళ్తుంటే అన్నా, చెల్లెలో, అక్కా తమ్ముడో, తండ్రీ కూతురో తెలుసుకో కుండానే సంబంధం అంటగట్టే ఈ గుడ్డిలోకం యిక ఎప్పటికి బాగుపడదు.

అనుమానం పెనుభూతం! దానికి నీ మనసులో తావీయకు, తావిచ్చావో నిన్ను నీ జీవితాన్ని ముక్కలు చేసిగాని వదలదు. నీ చల్లని సంసారాన్ని ఛిన్నాభిన్నం చేసుకోకు. నేనెక్కడున్నా మీ సుఖమే క్షేమమే కోరుతుంటాను. మీ జీవితాల్లోకి ప్రవేశించను. నా నీడ కూడా పొరపాటున మీపై వాలదు. మీసుఖమయ జీవితంలో అశాంతి కలిగిస్తే క్షంతవ్యుడ్ని.

మీకు మరెప్పుడూ కనుపించని

మీవాడు కాలేని

మనోహర్.

ఆ ఉత్తరాన్ని చదువుతూ అలాగే శూన్యంలోకి చూస్తుండిపోయింది మోహిని.

(సంపూర్ణం)


# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 9-00.

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారలుగా చేరండి.

అన్ని హిగ్గిన్‌బాథమ్స్ బుక్‌స్టాల్సులో దొరుకును.

♦ కథాంజలి ♦

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 001.